యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు

- నిమ్మగడ్డ లంకలో రాత్రిళ్లు జోరుగా బుసక, మట్టి తరలింపు
- సీఆర్‌జెడ్ నిబంధనలకు నీళ్లు
- పట్టించుకోని అధికారులు



నిమ్మగడ్డ లంకలో రాత్రిళ్లు జేసీబీలతో ట్రాక్టర్లల్లో మట్టిని లోడు చేస్తున్న దృశ్యం

చల్లపల్లి: అవనిగడ్డ నియోజకవర్గంలోని చల్లపల్లి మండలం నిమ్మగడ్డ లంకలో రాత్రిళ్లు అక్రమార్కులు యథేచ్ఛగా బుసక, మట్టి తవ్వకు పోతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా కేవలం రాత్రి సమయాల్లోనే జేసీబీలను తీసుకువచ్చి ట్రాక్టర్లల్లో బుసక, మట్టి తరలించుకుపోతున్నారు. వాస్తవానికి చల్లపల్లి మండల పరిధిలోని నడకుదురు, నిమ్మగడ్డ, వెలివోలు ఇసుక క్వారీలు కోస్టల్ రెగ్యులేషన్ జోన్(సీఆర్‌జెడ్) పరిధిలో ఉన్నందున ఈ ప్రాంతాల్లో ఇసుక, బుసక, మట్టి వంటివి తవ్వి తరలించడం నిషేదం. జిల్లా అధికారులు కూడా ఈ ప్రాంతాల్లో ఇసుక పాటలు నిర్వహించకూడదని ఆదేశించారు. సీఆర్‌జెడ్ నిబంధనలకు నీళ్లోదిలి అక్రమార్కులు నిమ్మగడ్డ లంకలోని బుసక, మట్టిని తరలిస్తున్నారు. ఈనెల 3వ తేదీ గురువారం రాత్రి గం.10ల నుంచి 4వ తేదీ శుక్రవారం తెల్లవారుజామున గం.4ల వరకూ మట్టి, బుసకను నదీ గర్భంలోని లంక నుంచి తరలించారు. ప్రస్తుతానికి తవ్వకం జరిగే ప్రదేశానికి దగ్గర్లో ఉన్న ఊర్లకు మాత్రమే మట్టిని సరఫరా చేస్తున్నారు. నిమ్మగడ్డ వంటి దగ్గర ప్రాంతాల్లో అయితే ట్రాక్టర్ మట్టి లేదా బుసకకు రూ.1,800లు నుంచి రూ.2వేలు చొప్పున అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్క రాత్రే సుమారు 100 నుంచి 120 ట్రాక్టర్లు తరలిపోతున్నట్లు అంచనా.

తరిగిపోతున్న లంక భూములు

నిమ్మగడ్డ లంకలోని భూములను నిరుపేదలైన దళితులను సొసైటీగా ఏర్పాటుచేసి వారు సాగు చేసుకుని పంట పండించుకునేందుకు ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే అక్రమార్కులు చిన్న రైతులకు ఆశ చూపి ఆయా పొలాలతోపాటు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమి నుంచి కూడా మట్టిని తవ్వుకుపోతూ అమ్ముకుని అందినకాడికి దండుకుంటున్నారు. ప్రతి ఏడాది కృష్ణానదికి వచ్చే వరదల కారణంగా లంక అంచుల వెంబడి మట్టి కొట్టుకుపోవడంతో కుంచించుకుపోతోంది. దీంతో కొందరు రైతులు భూములు కోల్పోతున్నారు. ఇలా మట్టి తవ్వడం వల్ల కూడా భూమి గుల్లబారి వరదల సమయంలో కొట్టుకుపోయే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత రెవెన్యూ, పోలీసు యంత్రాంగం స్పందించి ఈ మట్టి, బుసక అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేయాలని, సీఆర్‌జెడ్ నిబంధనలను అతిక్రమించి వ్యవహరిస్తున్న అక్రమార్కులపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నిఘా పెడతాం

నిమ్మగడ్డ లంకలో నిఘా పెట్టి మట్టి, బుసక, ఇసుక అక్రమ రవాణా జగరకుండా చర్యలు తీసుకుంటాం. ఎవరైన అక్రమంగా మట్టి, బుసక, ఇసుక తరలిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

ఎస్‌ఐ పీఎస్‌వీ సుబ్రహ్మణ్యం

శ్మశానానికి తాళం వేసిన టీడీపీ నేత



కమిషనర్ బాపిరాజుకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర శివారు నవీన్ మిట్టల్‌కాలనీ సమీపాన ఉన్న క్రైస్తవుల శ్మశాన గేటుకు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, టీడీపీ నాయకుడు పంచపర్వాల కాశీవిశ్వనాథం(చంటి) తాళం పెట్టి తన సొంత అవసరాలకు వినియోగించుకోవడం విమర్శలకు తావిస్తోంది. శ్మశాన గేటు తాళాలను స్వాధీనం చేసుకుని కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించాలని కోరుతూ క్రైస్తవులు, దళిత సంఘ నాయకులు శనివారం కమిషనర్ బాపిరాజును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి బందెల థామస్ నోబుల్ మాట్లాడుతూ మచిలీపట్నం నగరంలోని క్రైస్తవులకు మున్సిపాలిటీ పరంగా 50 ఏళ్లుగా శ్మశాన సమస్య ఉండటంతో నాటి మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) 2020లో ఏడు ఎకరాల భూమిని కొనుగోలు చేసి క్రైస్తవుల శ్మశానాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఇటీవల మున్సిపల్ మాజీ చైర్మన్ చంటి శ్మశాన గేటుకు తాళం వేసుకొని ఎవరినీ వెళ్లకుండా అడ్డుకుంటున్నాడన్నారు. కూటమి పాలనలో క్రైస్తవులు, దళితులకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు(జానీ), మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గాడెల్లి డేవిడ్ శామ్యూల్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మేకల సుబ్బన్న, ఉపాధ్యక్షుడు గూడవల్లి నాగరాజు, కోఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మాజీ కౌన్సిలర్లు చిటికెన నాగేశ్వరావు, శీలం బాబ్జి, కొక్కిలిగడ్డ శరత్ కుమార్, వెంకటేశ్వరరావు, నాయకులు ఉన్నారు.

కేయూలో స్మార్ట్ క్లాస్ రూమ్స్



కోనేరుసెంటర్: మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం అవసరమని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. రాంజీ పేర్కొన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్ రూమ్స్‌ను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏపీ రీజినల్ హెడ్ పవన్‌కుమార్‌తో కలిసి శనివారం ఉపకులపతి ఆచార్య రాంజీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్మార్ట్ టీవీ ఏర్పాటు విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, కంప్యూటర్ సైన్స్ డీన్ ఆచార్య వైకే సుందర కృష్ణ, సహాయ ఆచార్యులు డా కిరణ్ కుమార్, డా శ్రావణి, హెచ్‌డీఎఫ్‌సీ జోనల్ హెడ్ మహేష్‌నాయుడు, క్లస్టర్ హెడ్ పీ నరేష్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సత్కారం



చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టర్ డీకే బాలాజీని పలువురు జిల్లా, క్షేత్రస్థాయి అధికారులతో పాటు పలుశాఖలకు సంబంధించిన ఉద్యోగులు సత్కరించారు. ఐఏఎస్ అధికారిగా బాధ్యతలు చేపట్టి నేటికి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశపు హాలులో కలెక్టర్‌కు జ్ఞాపికను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ డెప్యూటీ సీఈవో ఆర్‌సీ ఆనంద్‌కుమార్, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ శివరాంప్రసాద్, డీపీవో జె అరుణ, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, గృహనిర్మాణశాఖ అధికారి వెంకట్రావు, ఆర్‌అండ్‌బీ ఈఈ లోకేష్ పాల్గొన్నారు. తొలుత కలెక్టర్ బాలాజీ కేక్ కట్ చేశారు.

పాఠశాల తనిఖీ

గూడూరు: మండలంలోని గురిజేపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గూడూరు ఎంఈఓ-2 పి.సుబ్రహ్మణ్యం శనివారం తనిఖీ చేశారు. పాఠశాల రిజిస్టర్లను పరిశీలించి విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం, విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీని సమీక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయని పి.జ్యోతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై ధర్నా



అవనిగడ్డ: ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ డిపో గేటు ముందు యూనియన్ నేతలు శనివారం ధర్నా చేశారు. యూనియన్ అధ్యక్షుడు బీఎల్ ప్రసాద్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి మహేష్, నాయకులు బీ సురేష్, పీపీ రంగారావు, కమల, వెంకటలక్ష్మి, ప్రసన్న కుమార్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు నివాళి

కోనేరుసెంటర్: బందరు మండలం కోన గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పిండి గోపాలం శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) గ్రామానికి చేరుకుని గోపాలం భౌతికకాయానికి పూల మాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పేర్నితో పాటు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు గణేశన రమేష్, తలుపుల లక్ష్మణ్‌బాబు తదితరులు ఉన్నారు.

ముగిసిన నవరాత్రులు



నాగాయలంక: స్థానిక కృష్ణానదీ తీరంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో శ్రీరామ క్షేత్రం కమిటీ నిర్వహించిన వారాహి అమ్మవారి ఆషాఢ గుప్త నవరాత్రుల మహోత్సవాలు శుక్రవారం రాత్రి ముగిశాయి. ముగింపు ఉత్సవంలో భాగంగా శుక్రవారం రాత్రి ఆలయ అర్చకులు వారాహిదేవి పీఠం వద్ద శాస్త్రోక్తంగా గణపతి పూజ, పుణ్య హవాచన తీర్థంతో అమ్మవారి విగ్రహ సంప్రోక్షణ, సహస్ర నామ కుంకుమార్చన జరిపారు. అనంతరం అర్చకులు చేపట్టిన పది రోజుల దీక్షను విరమించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని వారాహి మాత, కనకదుర్గమ్మలను దర్శించుకున్నారు. కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలా కృష్ణప్రసాద్(బుజ్జి), రాము పాల్గొన్నారు.

మోకాళ్లపై మూడు కి.మీ. నడక

కోడూరు: కుమార్తె ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ ఓ తల్లి మూడు కిలోమీటర్ల మేర మోకాళ్లపై నడిచి వెంకన్నను దర్శించుకున్న ఘటన కోడూరు మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని శ్రీరామపురం గ్రామానికి చెందిన కన్నా మౌనిక కుమార్తె రెండు నెలల కితం పాము కాటుకు గురయింది. అప్పటి నుంచి కుమార్తె ఆరోగ్యం క్షీణించింది. చిన్నారికి తల్లిదండ్రులు వైద్యం కూడా చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో కుమార్తె ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ తల్లి మౌనిక శ్రీరామపురం నుంచి కోడూరులోని కల్యాణ వెంకటేశ్వరస్వామివారి ఆలయానికి మోకాళ్లపై నడుచుకుంటూ వచ్చి పూజలు చేసింది.

అమ్మవార్లకు ఆషాఢ సారెలు



కోడూరు: మండలంలోని విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి భక్తులు శనివారం ఆషాఢ సారెను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలమూర్తికి చేసిన అలంకారం ఆకట్టుకుంది. ఆలయ అధికారిని జయశ్రీ పర్యవేక్షించారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని బలరామునిపేటలో వేంచేసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో సీతమ్మకు మహిళా భక్తులు శనివారం ఆషాఢ సారెను అందజేశారు. అమ్మవారు శాఖాంబరీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లారిశెట్టి శ్రీనివాసరావు, భక్తబృంద సభ్యులు పర్యవేక్షించారు.

కె. కొత్తపాలెం(మోపిదేవి): కె. కొత్తపాలెం కృష్ణానది ఒడ్డున కొలువైన శ్రీదుర్గా కోటేశ్వరస్వామివారి దేవస్థానంలో వారాహి నవరాత్రులు కొనసాగుతున్నాయి. అమ్మవారిని కిరాత వారాహిగా అలంకరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

13న ఉచిత వైద్య శిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో 13వ తేదీ ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ నిర్వాహకుడు తలశిల రఘుశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగాయలంకలోని మారుతీ విద్యా నికేతన్ డిజిటల్ స్కూలు ఆవరణలో ఉదయం తొమ్మిది నుంచి ఒంటి గంట వరకు శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు.

సంక్షిప్తం

రేషన్ బియ్యం పట్టివేత

పెడన: పట్టణంలో విజిలెన్సు అధికారులు రేషన్ బియ్యం కొనుగోలు చేసి విక్రయిస్తున్నారనే సమాచారంతో శనివారం తనిఖీలు చేపట్టారు. 14, 17వ వార్డుల్లో రహస్యంగా అద్దె ఇళ్లలో దాచిన బియ్యం నిల్వలను గుర్తించినట్లు విజిలెన్స్ ఎస్‌ఐ కె. కృష్ణసాయి తెలిపారు. మొత్తం 1,200 కిలోల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు చెప్పారు. పీడీఎస్ డీటీ నాగమల్లేశ్వరరావు కేసు నమోదు చేశారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

కోడూరు: కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే లెబర్ కోడ్ రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నేతలు పిలుపునిచ్చారు. శనివారం కోడూరులోని పలు పంచాయతీ కార్యాలయాల్లోని అధికారులకు సమ్మె నోటీసు అందించారు. సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. సీఐటీయూ నేతలు పోలినాయుడు, పోలాబత్తిన మోహనరావు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఘంటసాల: ఘంటసాల గోటకం కమ్యూనిటీ హాలు వద్ద శనివారం సమావేశంలో సీఐటీయూ ప్రజా సంఘాల నేతలు పలు డిమాండ్లతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. సీఐటీయూ నేతలు మహ్మద్ కరీముల్లా, వాకా రామచంద్రరావు, పంచరక్ల రామారావు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు శ్రీమన్నారాయణుడికి అభిషేకాలు

కోడూరు: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామివారి మూలమూర్తికి ఆదివారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజీయర్ స్వామిజీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 అడుగుల ఏకశిలా శ్రీమన్నారాయణుడి వివిధ నదుల నుంచి తీసుకువచ్చిన జలాలతో అభిషేకాలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

లక్ష్మీనారాయణస్వామి పవిత్రోత్సవాలు

అవనిగడ్డ: చారిత్రక ప్రసిద్ధినొందిన లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శనివారం పవిత్రోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ యార్లగడ్డ శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

బస్టాండ్‌లలో మౌలిక వసతులు మెరుగు

మచిలీపట్నంటౌన్: ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు జిల్లాలోని అన్ని బస్టాండ్‌లలో మౌలిక వసతులను మెరుగుపరిచామని జిల్లా ప్రజా రవాణాధికారి కొడమంచిలి వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక బస్టాండ్ ఆవరణలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాలోని పలు బస్టాండ్‌లలో 28 ఫ్యాన్‌లను ఏర్పాటు చేశామన్నారు. సూపర్‌లగ్జరీ బస్సుల బాడీలను మార్చి మంచి కండీషన్‌తో తిప్పేందుకు చర్యలు తీసుకుంటునానమన్నారు. జిల్లాలోని ఉయ్యూరు, పామర్రు, ఉంగుటూరు, నాగాయలంక బస్టాండ్‌ల వద్ద ఖాళీ స్థలాలను 17 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చేందుకు టెండర్ల ప్రక్రియ జరుగుతోందన్నారు. ఈ నెల 28వ తేదీన ఈ టెండర్లను ఓపెన్ చేయడం జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలు ఆర్టీసీ వెబ్‌సైట్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. మచిలీపట్నం డిపో మేనేజర్ టీ పెద్దిరాజు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ

బంటుమిల్లి: మండలంలోని మల్లేశ్వరం గ్రామంలో ఆర్థమూరు పశువైద్యశాల ఆధ్వర్యాన శనివారం లేగదూడలకు, జీవాలకు నట్టల నివారణ మందులను అందజేశారు. ఈ శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు పేపేటి వీరబాబు ప్రారంభించారు. పశుపోషకులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. షీప్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కందుల వడ్డీకాసులు, కుంభం ఏడుకొండలు, వెటర్నరీ హెల్త్ అసిస్టెంట్ శ్రావణి పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు చెల్లించాలి

అవనిగడ్డ: తక్షణమే పీఆర్సీ కమిషనర్ నియామకం చేపట్టాలని, పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలని ఏపీ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అవనిగడ్డ మండల శాఖ అధ్యక్షుడు ఎం. రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ పెన్షనర్స్ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. కార్యదర్శి అబ్దుల్ అజీజ్, మాజీ అధ్యక్షుడు కే నాగేశ్వరరావు, కోశాధికారి ఆర్ నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సుధాకరరావు, సహాధ్యక్షుడు ఆర్ రాధాకృష్ణ, సలహాదారుడు నాగభూషణం పాల్గొన్నారు.

నేడు కనకదుర్గమ్మకు ఆషాఢ సారె

నాగాయలంక: ఆషాఢ మాసం, తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని స్థానిక కృష్ణానది తీరాన శ్రీరామపాదక్షేత్రం ప్రాంగణంలో కొలువైన శ్రీకనకదుర్గమ్మ దేవస్థానంలో ఆదివారం ఆషాఢ సారె వేడుక నిర్వహిస్తున్నట్లు క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, నిర్వాహక ప్రతినిధి ఉప్పల లీలా కృష్ణప్రసాద్ శనివారం తెలిపారు. గ్రామంలోని బోసుబొమ్మ కూడలిలో కొలువున్న శ్రీపోతురాజుస్వామి దేవస్థానం, వివిధ గ్రామ దేవతల ఆలయాల నుంచి ఆషాఢ సారె పళ్లాలు, పసుపు కుంకుమలతో మహిళలు భారీ ఊరేగింపుగా దుర్గమ్మ గుడికి తీసుకొస్తారన్నారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆషాఢ సారె సమర్పణ విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేడు పెంపుడు కుక్కలకు టీకాలు

పెడన: జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం పెంపుడు కుక్కలకు, పిల్లులకు వ్యాధి నిరోధక టీకాలను ఉచితంగా వేయనున్నట్లు పశుసంవర్థక శాఖ ఏడీ కొనకళ్ల బాబురావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెంపుడు జంతువుల యజమానులు తమ పెంపుడు జంతువుతో పాటు ఆధార్‌కార్డు తప్పనిసరిగా వెంటతెచ్చుకోవాలని తెలిపారు.

లక్ష గాజులతో అలంకారానికి ఏర్పాట్లు

మచిలీపట్నంటౌన్: శ్రావణమాసంలో స్థానిక గాంధీ బొమ్మ శివాలయంలో వేంచేసి ఉన్న శ్రీమహిషాసురమర్దిని అమ్మవారికి నిర్వహించనున్న లక్ష గాజుల అలంకారానికి సంబంధించిన కార్యక్రమాన్ని భక్తులు శనివారం నిర్వహించారు. మహిషాసురమర్దిని అమ్మవారికి శ్రీ గరుడ సేవా సమితి భక్త బృందం, హరే శ్రీనివాస భక్త బృందాల వారు లక్ష గాజులను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి అమ్మవారి ముందుంచారు. ఆలయ చైర్మన్ తమ్మన రాధాకృష్ణ మూర్తి, కార్యదర్శి ఎండూరి సురేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చల్లపల్లి: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) చల్లపల్లి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోమలానగర్‌లో జరిగిన జనరల్ కౌన్సిల్ సమావేశంలో అధ్యక్షుడిగా భోగాది వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శిగా పి.దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులుగా కొమ్ముకూరి ప్రసాదరావు, పి.రాజ్యలక్ష్మి, పి.నాంచారయ్య, కార్యదర్శులుగా ఎం.డి. ఇస్రహాని, ఆర్. నవీన్‌శ్రీనివాస్, కె.రమాదేవి, టి.రేణుప్రసాద్, జిల్లా కౌన్సిలర్లుగా సిహెచ్ రాధారాణి, యు.కృష్ణారావు, కె.సునీతారావు, ఆడిట్ కన్వీనర్‌గా ఎ.సాయి కృష్ణ, సభ్యులుగా ఎ.అమీన్, కె.అనిల్, బి.నాగ లక్ష్మిలను ఎన్నుకున్నారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సాంబశివరావు, రాష్ట్ర కౌన్సిలర్ జి.వెంకటేశ్వరరావు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు.

పీర్లకు దట్టీ సమర్పణ



దట్టీని ప్రదర్శనగా తీసుకెళుతున్న పేర్ని కిట్టు, నాయకులు

మచిలీపట్నంటౌన్: మొహర్రం దుఃఖదినాల10వ రోజు సందర్భంగా స్థానిక 33వ డివిజన్‌లోని భారీమామ్ పంజాలోని పీర్లకు వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) శనివారం షమ్‌లా(దట్టీ) సమర్పించారు. స్థానిక డివిజన్ కార్పొరేటర్ మీర్ అస్గర్ అలీ గృహం నుంచి బయలుదేరి భారీమామ్ పంజా వరకూ పేర్ని కిట్టు దట్టీని ప్రదర్శనగా తీసుకువచ్చి సమర్పించారు. కాగా 9వ రోజైన శుక్రవారం రాత్రి నగరంలోని పలు పంజాలకు పేర్ని కిట్టు వెళ్లి పంజాల వద్ద దట్టీలను సమర్పించారు. ముస్లింలు జరిపిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. భారీమామ్ పంజా వద్ద జరిగిన కార్యక్రమంలో మచిలీపట్నం మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ అచ్చేబా, కార్పొరేటర్ మీర్ అస్గర్‌అలీ, వైఎస్సార్ సీపీ నాయకులు శొంఠి ఫరీద్, షేక్ మహమ్మద్ సాహెబ్, నజాఫ్ అలీ, మహమ్మద్ ఇస్మాయిల్, అడ్డగర్ల శ్రీనివాస్, కుమ్మరి హర్ష, కార్యకర్తలు పాల్గొన్నారు.

వల్లభనేని వంశీకి మాజీ మంత్రుల పరామర్శ



వల్లభనేని వంశీని పరామర్శిస్తున్న మాజీ మంత్రులు కొడాలి, పేర్ని

హనుమాన్‌జంక్షన్ రూరల్: అక్రమ కేసుల్లో అరెస్ట్ అయి 140 రోజుల పాటు నిర్బంధంలో ఉన్న వైఎస్సార్ సీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని శనివారం పరామర్శించారు. బాపులపాడు మండలం ఎ.సీతారామపురంలో ప్రస్తుతం నివాసం ఉంటున్న వంశీ వద్దకు ఇరువురు నేతలు వచ్చారు. జైలులో పలుమార్లు అనారోగ్యానికి గురికావడంతో వంశీ యోగక్షేమాలను వారు అడిగి తెలుసుకున్నారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై భారం



చల్లపల్లి ప్రధాన సెంటర్‌లో ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

చల్లపల్లి: స్మార్ట్ మీటర్లతో పేద ప్రజలపై మోయలేని భారం పడుతుందని సీపీఐ అవనిగడ్డ నియోకవర్గ కార్యదర్శి గుత్తికొండ రామారావు పేర్కొన్నారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ నాడు ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లు వద్దని తమతో కలిసి పోరాడిన టీడీపీ నేడు అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజల నడ్డి విరిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. అదనపు భారాన్ని మోపే స్మార్ట్ మీటర్లను ప్రజలందరూ వ్యతిరేకించాలని కోరారు. ట్రూఆప్, సర్దుబాటు చార్జీలతో ఇప్పటికే ప్రజల్ని కన్నీరు పెట్టిస్తున్న ప్రభుత్వం వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండు చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, నాయకులు చంద్ర సుబ్బారావు, అల్లూరి బాబూరావు, నక్కా శ్రీనివాసరావు, సిద్ధాబత్తుల బాలయ్య, సిద్ధాబత్తుల వాసు, రైతు సంఘం నాయకుడు హెచ్ సురేంద్రనాద్ బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలకు శిక్షణ తరగతులు ప్రారంభం



బీఎల్‌వోలతో గూడూరు, పెడన తహసీల్దార్లు రాజ్యలక్ష్మి, అనిల్‌కుమార్

పెడన: బీఎల్‌వోలు విధులు పట్ల అంకితభావంతో ఉండాలని, ఉన్నతాధికారులు సూచించిన, నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన చేరుకుని మంచిపేరు తెచ్చుకోవాలని గూడూరు తహసీల్దారు జి. రాజ్యలక్ష్మి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పెడన నియోజకవర్గంలోని బీఎల్‌వోలకు నాలుగు రోజులు పాటు నిర్వహించే శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు శిక్షణ తరగతులకు గూడూరు మండలంలోని బీఎల్‌వోలు హాజరయ్యారు. వీరికి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఫోన్ యాప్‌లో బీఎల్‌వోల విధులు, యాప్‌లో ఓటరు నమోదు, క్లయిమ్‌లు ఏ విధంగా చేయాలనే దానిపై అవగాహన కల్పించారు. ఉదయం వీరికి పెడన ఇంఛార్జి తహసీల్దారు కె. అనిల్‌కుమార్ దిశానిర్దేశం చేశారు. సాయంత్రం గూడూరు తహసీల్దారుతో కలిసి పెడన ఇంఛార్జి తహసీల్దారు బీఎల్‌వోలకు ఎగ్జామ్ నిర్వహించి పార్టిసిపెంట్ సర్టిఫికెట్లను అందజేశారు. పెడన ఇంఛార్జి ఆర్‌ఐ విజయలక్ష్మి, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

'సుపరిపాలన'లో సమస్యల ఏకరువు



ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దేవాంగ సంఘం ప్రతినిధులు

గూడూరు: కప్పలదొడ్డి గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్‌కు గ్రామస్తులు మొర పెట్టుకున్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ శనివారం కప్పలదొడ్డిలో పర్యటించారు. ఈ సంరద్భంగా స్థానిక దేవాంగ సంక్షేమ సంఘం ప్రతినిధులు గ్రామంలో తాగునీటి సమస్య, అంతర్గత రహదారులు, డ్రెయినేజీ, శ్మశాన వాటిక సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో దశాబ్దాల క్రితం నిర్మించిన రక్షిత నీటి పథకం గ్రామ తాగునీటి అవసరాలను తీర్చలేకపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సరఫరా అవుతున్న నీరు తాగడానికి ఉపయోగకరంగా లేదన్నారు. అంతర్గత రహదారులు, డ్రెయినేజీ సమస్యల కారణంగా చాలా ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. వీటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

మండలాభివృద్ధికి కృషి చేయాలి

ఘంటసాల: పార్టీలకు అతీతంగా మండలాభివృద్ధికి అందరూ కృషి చేయాలని ఎంపీపీ వేమూరి రజని కుమారి అన్నారు. ఘంటసాల మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన ఎంపిడివో డి.సుబ్బారావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చినకళ్లేపల్లి సర్పంచ్ గుత్తికొండ రామారావు మాట్లాడుతూ పొలం గట్లు వెంబడి తాటి చెట్లను సంరక్షించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పలువురు ఎంపీటీసీలు జీతాలు ఎప్పుడు ఇస్తారంటూ ప్రశ్నించారు. గత డిసెంబరు నుంచి పంచాయతీలకు నిధులు రాలేదని ఎప్పుడు ఇస్తారో చెప్పాలని ఎంపీడీవో సుబ్బారావును ప్రశ్నించారు. స్పందించిన ఎంపీడీవో ఆయా సర్పంచులు చెప్పిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల మురళీ కృష్ణ, ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

టెండర్ల ప్రక్రియ పూర్తి

మోపిదేవి: స్థానిక ఎంజేపీ ఏపీబీసీడబ్ల్యూఎస్ గురుకుల పాఠశాలలో కూరగాయలు, పండ్లు, కోడిగుడ్లు, చికెన్ సరఫరా నిమిత్తం సీల్డ్ టెండర్ ప్రక్రియ పూర్తయినట్లు పాఠశాల, గురుకుల కళాశాల కరస్పాండెంట్ వీర రవి తెలిపారు. ఈనెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు మచిలీపట్నం కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో ఓపెన్ చేసి టెండర్ ఖరారు చేయడం జరుగుతుందని వివరించారు.

లోక్‌అదాలత్‌లో 193 కేసులు పరిష్కారం

బంటుమిల్లి: స్థానిక జూనియర్ సివిల్‌కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 193 కేసులు పరిష్కారమయ్యాయి. మండల లీగల్ సెల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఎం.భాస్కరరావు పర్యవేక్షణలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో క్రిమినల్ కేసులు 51, సివిల్ 3, ఎస్టీసీ 139 కేసులు రాజీ అయ్యాయి.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543 (మచిలీపట్నం, పెడన)
79955 66983 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com